క్లుప్తంగా

ఎస్ఈఏఎస్ నిర్వహణపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి జాన్‌ప్రసాద్

పాయకరావుపేట: నవంబర్ 3న నిర్వహించ బోయే స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేకు సంబంధించి మండల విద్యాశాఖాధికారి పి.జాన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3, 6, 9 తరగతుల విద్యార్థులను ఎస్ఈఏఎస్ పరీక్షకు సన్నద్ధం చేయడంలో మెలకువలు, పరీక్ష నిర్వహణలో జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, రిసోర్స్ పర్సన్ సీహెచ్ఎస్ దొర తదితరులు పాల్గొన్నారు.

2న సాంబశివుని రాట మహోత్సవం

మునగపాక: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేరుగాంచిన మునగపాక సాంబశివుని ఉత్సవంలో భాగంగా గురువారం(నవంబర్ 2న) రాట మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఏటా కార్తీకమాసం రెండవ సోమవారం శూలాల మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది నవంబర్ 27న ఉత్సవాన్ని అందరి సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందుగా జరిగే రాట మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేవీ పనులపై తహసీల్దార్‌కు వినతి

రాంబిల్లి: నేవీ ప్రహరీ పనుల విషయంలో తమకు న్యాయం చేయాలని పెదకలవలాపల్లి గ్రామ రైతులు తహసీల్దార్ పి.భాగ్యవతికి సోమవారం వినతిపత్రం అందించారు. సోమవారం పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ప్రహరీ పనులు తమ జిరాయితీ స్థలాల్లో చేస్తున్నట్లు తమకు అనుమానాలున్నాయని, సర్వే చేసిన తర్వాతే పనులు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వై.లోవ సర్పంచ్ నారాయణరావు, దేముడునాయుడు, దేముళ్లు తదితరులున్నారు.

తుప్పలతో అవస్థలు



కాకరాపల్లి-నారాయుడుపాలెం రోడ్డులో తుప్పలు

మునగపాక: మండలంలోని కాకరాపల్లి-నారాయుడుపాలెం రోడ్డులో పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం కాకరాపల్లి, నారాయుడుపాలెం తదితర గ్రామాల ప్రజలు దైనందిన పనులపై మునగపాక, అనకాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డే ప్రధాన రహదారి కావడంతో తుప్పలను గమనించుకుంటూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయంటూ పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన మంత్రి



భాస్కర్‌కు చెక్కు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: బ్రెయిన్‌కు శస్త్ర చికిత్స చేయించుకున్న పట్టణానికి చెందిన కోలపర్తి కల్యాణ భాస్కర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష మంజూరైంది. చెక్కును మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్వగృహంలో సోమవారం బాధితునికి అందించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సకల గోవిందరావు పాల్గొన్నారు.

ఖనిజాలు గుల్ల.. ఖజానా డొల్ల

నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగిపోతోంది. నియంత్రించాల్సిన అధికారులు 'మామూళ్లు'గా మిన్నకుండిపోతున్నారు. కొండలు, జిరాయితీ భూములతో పాటు సముద్రపు ఇసుకనూ తరలించేస్తున్నారు. చివరికి పోలవరం కాలువ గట్లనూ వదిలిపెట్టట్లేదు. దీంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



గ్రావెల్ తవ్వకాల అనంతరం గోపాలపట్నం, ఉద్దండపురం ఆవ సమీపంలో కొండ



గునిపూడి వద్ద జిరాయితీ భూముల్లో గ్రావెల్ తవ్వేసిన దృశ్యం

- యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ దందా
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- పోలవరం కాలువ గట్లకు ముప్పు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రావెల్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా కొండల్ని పిండి చేస్తూ, గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. రోజూ రాత్రి సమయాల్లో పొక్లెయిన్ల సాయంతో తవ్వకాలు జరిపి లారీలు, ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. కొండలు, గెడ్డలతోపాటు, పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు ఉన్న పోలవరం కాలువ గట్లను కూడా వదిలిపెట్టడం లేదు.

ప్రభుత్వ ఖజానాకు గండి

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా గ్రావెల్ తవ్వకాలతో ఖజానాకు ఏటా రూ.కోట్లలో గండి పడుతోంది. వ్యాపారులు అక్రమంగా తవ్విన గ్రావెల్‌ను ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. లేఅవుట్లలో రోడ్లకు, నిర్మాణాల కోసం వీటిని వినియోగిస్తున్నారు. పాయకరావుపేట మండలంలో సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, మంగవరం, పీఎల్‌పురం, సీతారామపురం, మాసయ్యపేట, నక్కపల్లి మండలంలో గునిపూడి, బంగారయ్యపేట, డీఎల్ పురం, దోసలపాడు, రేబాక, జగన్నాథపురం, వేంపాడు, చందనాడ, అమలాపురం, మూలపర, నెల్లిపూడి, ఎస్.రాయవరం మండలంలో పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, గుడివాడ, తదితర గ్రామాల్లో గ్రావల్ దందా, సముద్రపు ఇసుక తరలింపు నిరాటంకంగా సాగిపోతోంది.

పోలవరం గట్లనూ తవ్వేస్తున్నారు

గత కొన్ని రోజులుగా పోలవరం కాలువ మట్టి తరలిరపు యథేచ్ఛగా జరుగుతోంది. గ్రామాల్లో కొండలనే కాకుండా పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు ఉన్న పోలవరం కాలువ ఇరువైపులా ఉన్న గట్లను కూడా తవ్వేసి, గ్రావెల్ తరలించుకుపోతున్నారు. దీంతో గట్లు బలహీనపడుతున్నాయన్న ఆందోళన నెలకొంది. జిరాయితీ భూముల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇలా తవ్విన గ్రావెల్‌ను ట్రాక్టర్ లోడ్ రూ.2 వేలు, లారీ లోడ్ రూ.6 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా రోజూ వందలాది ట్రాక్టర్లు, లారీల లోడ్ల గ్రావెల్ తరలిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఎటువంటి సీనరేజ్ చార్జీలు చెల్లించడం లేదు. కనీసం అనుమతులు కూడా తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సముద్రపు ఇసుకనూ వదలట్లేదు

అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయంలో అధికారులకు పూర్తి సమాచారం ఉన్నా.. పట్టించుకోవట్లేదన్న ఆరోపణలున్నాయి. మహిళా పోలీసులు, వీఆర్వోలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు మాత్రమే కాకుండా డీఎల్ పురం, అమలాపురం, పాల్మన్‌పేట, పెంటకోట, బంగారయ్యపేట, తీనార్ల, గునిపూడి, రేవుపోలవరం తదితర గ్రామాల్లో సముద్రతీరం వెంబడి ఉన్న ఇసుకను సైతం తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. దీన్ని నిర్మాణానికి వినియోగించే ఇసుకలో కలిపి, విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రావెల్ అక్రమ తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రావెల్, ఇసుక అక్రమ తరలింపు విషయం మా దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతుల్లేకుండా ఖనిజ సంపద తరలించడం చట్టరీత్యా నేరం. వీటిపై చర్యలు తీసుకునే అధికారం మాకు ఉంది. సిబ్బంది కొరత వల్ల ప్రత్యేక దృష్టి సారించలేకపోయాం. ఇక మీదట ఈ అక్రమ వ్యవహారాలపై దృష్టిసారించి, కఠిన చర్యలు తీసుకుంటాం

– అప్పలరాజు, సీఐ

మళ్లీ సీఎంగా జగన్ విజయానికి కృషి

సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి



మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారితో చర్చిస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. సోమవారం రాత్రి వారంతా యలమంచిలిలో రమాకుమారిని, ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. యలమంచిలి మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజాసేవను అభినందించారు. రాష్ట్రంలో సీఎం జగన్ నేతృత్వంలో అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ పార్టీ విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా, తన దృష్టికి తీసుకొస్తే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. విశాఖ డెయిరీకి చెందిన పాల సేకరణ సంఘాల నాయకులను కూడా పార్టీ బలోపేతానికి కృషి చేసేలా సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొరుపోలు చిన్నారావు(దొప్పెర్ల), కాండ్రేగుల నూకరాజు(వాడ్రాపల్లి), అనూరాధ(నునపర్తి), పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి బాబ్జి, జిల్లా కార్యదర్శి ఈతా బాబూరావు, అచ్యుతాపురం వైస్ ఎంపీపీ వాసుపల్లి శ్రీనివాసు, ఎంపీటీసీ సభ్యులు ఇల్లా నాగేశ్వరరావు, రాజాన పైడి భాస్కరరావు, పీలా సందీప్, నగిరెడ్డి నాగేశ్వరరావు, పోలవరం పారునాయుడు, మేరుగు అప్పలనాయుడు, పార్టీ జిల్లా ఐటీ సెల్ జనరల్ సెక్రటరీ కూండ్రపు వెంకటరమణ, నాయకులు దుబాసి అప్పలనాయుడు, పిన్నమరాజు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాటిపల్లిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



మంగళవరపుపేటలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

మునగపాక: పాటిపల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తెలిపారు. మండలంలోని పాటిపల్లి శివారు మంగళవరపుపేటలో మరిడితల్లి గుడి నుంచి దుర్గమ్మతల్లి గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటిపల్లి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆడారి త్రిమూర్తులు, సచివాలయ కన్వీనర్ భీశెట్టి ధనశ్రీను, వార్డు సభ్యులు యల్లపు వరలక్ష్మి, ఆడారి లీలావతి, గనిరెడ్డి గోవింద, పంచాయతీ కార్యదర్శి మెహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వంతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న రజాక్

నక్కపల్లి: ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వం వికాసంపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది, మోటివేషనల్ స్పీకర్ ఎంఏ రజాక్ అన్నారు. మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్లో విద్యార్థులకు హెచ్ఎం సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ఓటమి నుంచి గెలుపు అనే అంశంపై స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని అందించారు. ఓటమి చెందడం నిజమైన ఓటమికాదని, ప్రయతించకపోవడమే అసలైన ఓటమి అన్నారు. వైఫల్యాలను ఎదుర్కొని ప్రపంచ వ్యాప్తంగా విజయానికి, యువతకు ప్రేరణగా నిలిచిన స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, ధోని, సచిన్ టెండూల్కర్, రతన్ టాటా వంటి మహనీయుల జీవితాల్లో జరిగిన యదార్థ సంఘటనలను వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలన్నారు. ఉత్తమ వ్యక్తిత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఏవీఎల్ఎన్ కుమారి, రమేష్ బాబు, చిన్నారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదల ఆరోగ్యానికి భరోసా



రాజయ్యపేటలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ కాసులమ్మ



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల స్టాల్



దార్లపూడి వైద్యశిబిరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా భరోసా కల్పిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ అన్నారు. సోమవారం రాజయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నివశించే వారికి ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజల చెంతకే వైద్యం తీసుకురావడం సాహసోపేతమైన నిర్ణయమన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల ఆరోగ్య సంరక్షణకు ఈ శిబిరాలు సాయపడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యులు మురళీకృష్ణారెడ్డి, సుకన్యలు వివిధ సమస్యలతో వచ్చిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన సుమారు 800 మందికి వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార తయారీని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్ అప్పలనర్స, ఎంపీటీసీ సత్తయ్య, నాయకులు మైలపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను పొందాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. దార్లపూడి మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయం-2లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి 409 మంది హాజరై, వైద్య సేవలు పొందారు. 10 మందిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ద్వారా విశాఖపట్నం తరలిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 122 మందికి కళ్లద్దాలు, 18 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు. వీటిని ఉచితంగానే సేవలు అందిస్తామన్నారు. ఎముకల వైద్య నిపుణులు నందకిషోర్, ఆప్తాలమిక్ అధికారి డా.వైష్ణవి, స్థానిక పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యులు రాజేశ్వరి, వాసంతిలు వైద్య సేవలు అందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నేడు

కోటవురట్ల: పీకే పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. టోకెన్లు తీసుకోనివారు కూడా శిబిరానికి హాజరై, స్పాట్ రిజిస్ట్రేషన్‌తో వైద్య సేవలు పొందవచ్చన్నారు. నిపుణులైన వైద్యులు హాజరై రోగుల్ని పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారన్నారు.

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రమూర్తి సోమవారం తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. రోగులకు అవసరమైన వైద్య సేవలతో పాటు, ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవం



నాగులాపల్లిలో గౌరీపరమేశ్వరుల నిలుపుదల మహోత్సవంలో స్థానికులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా సంతబయల చేరుకుని వరి దుబ్బును తీసుకువచ్చి ఆలయంలో ఉంచారు.

అనంతరం నూతనంగా తయారు చేసిన గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని విశ్వ బ్రాహ్మణుల ఇంటి నుంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తెచ్చి, ఆలయంలో నిలుపుదల చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, పాలసంఘ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, గ్రామస్తులు దొడ్డి శ్రీనివాసరావు, పెతకంశెట్టి రాజునాయుడు, పొలమరశెట్టి నాగు, సత్యనారాయణ, నూకాలయ్య, మొరా రమేష్, అప్పలనాయుడు, బొడ్డేడ బుజ్జి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన తప్పనిసరి



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ ఎస్ఐ గణేష్

యలమంచిలి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని యలమంచిలి సెబ్ ఎస్ఐ గణేష్ హితవుపలికారు. అనకాపల్లి సెబ్ జాయింట్ డైరెక్టర్ ఏఎస్పీ కె.విజయభాస్కర్ ఆదేశాల మేరకు సోమవారం యలమంచిలి పట్టణం గీతాంజలి కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఎక్కువగా యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అలాంటి వారికి సహకరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో ఎవరైన గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై సమాచారం ఉంటే సెబ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉన్నత భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.పద్మ, షేక్ హష్యా, బి.కరుణ, లక్ష్మి, సాయిదుర్గాప్రసాద్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

4న తునిలో అయ్యప్ప కోటి బిల్వార్చన



మాట్లాడుతున్న అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ప్రతినిధులు

పాయకరావుపేట: తొలిసారిగా తునిలో అయ్యప్ప స్వామి కోటి బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వచ్చే నెల 4న తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఆకుల వీర్రాజు స్థలంలో కాకినాడకు చెందిన ప్రముఖ వేలు గురుస్వామి, నాట్యాచార్య డాక్టర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఉత్తరాంధ్ర, కాకినాడ జిల్లాల్లో ఇప్పటివరకూ ఈ తరహా కార్యక్రమం నిర్వహించలేదని అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శబరిమలై నుంచి ప్రధాన పూజారి రాక

అయ్యప్ప కోటి బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు శబరిమలై అలయ ప్రధానార్చకులు, అయ్యప్పను స్వామిని పెంచిన పందళరాజవంశీకులైన నేటి తరం పందళ రాజు, 70 ఏళ్ల నుంచి మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి తిరువాభరణాలను మోసే గంగాధరన్ పిళ్లై, వీరితోపాటు 40 మంది కేరళ చండీ వాద్యకారుల బృందం వస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

15 వేల మంది భక్తుల కోసం ఏర్పాట్లు

ఉమ్మడి విశాఖ జిల్లా, కాకినాడ, తూర్పు గోదావరి సహా అనేక జిల్లాల నుంచి 15 వేల మంది అయ్యప్ప దీక్షాపరులు హాజరవుతారని అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు రెండు నెలల నుంచి ప్రచారం చేస్తున్నామన్నారు.

6 లారీల్లో బిల్వ పత్రాలు

అయ్యప్ప కోటి బిల్వార్చనకు ఆరు లారీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి బిల్వ పత్రాలను సేకరించి, నాలుగు రోజుల్లో తీసుకురానున్నారు. కోటి బిల్వార్చన సందర్భంగా ఒకేసారి వేలాది మంది దీక్షాపరులతో స్వామివారికి సామూహిక హారతులిచ్చేలా కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

రాయితీపై పాడి రైతులకు రుణాలు

నర్సీపట్నం: జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఔత్సాహిక రైతులకు రాయితీ రుణాలు అందిస్తున్నట్లు నర్సీపట్నం ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఏడీఏ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలు, పెరటికోళ్ల పెంపకానికి బ్యాంక్ లింకేజీ రుణాలు ఇస్తున్నాయన్నారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్ ఏర్పాటు చేసినట్లయితే గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు రాయితీ రుణం ఇస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



బంగారయ్యపేటలో అంబేద్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, స్థానికులు

కోటవురట్ల: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట ఎస్సీ కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వి.వి.రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, నీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డి-ఫారం పట్టా భూములు అన్యాక్రాంతం కాకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని బాధితుల వినతి మేరకు, ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.నాగాయమ్మ, హెచ్‌డీటీ కె.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యారావు, హెచ్‌డబ్ల్యూ ఒ.నిర్మల, ఏఎస్ఐ కె.రమణమ్మ, వార్డు సభ్యుడు కుందెల లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15న ప్రజా రక్షణ భేరి సభ

గొలుగొండ: కేంద్రం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తెలిపారు. ఆయన గొలుగొండలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం వల్ల ఇక్కడ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నట్లు వాపోయారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు కర్మాగారం వంటి పథకాలు అమలు చేయకపోవడతో వచ్చే నెల 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి పార్టీ నాయకులంతా హాజరు కావాలని కోరారు.

చెర్లోపల్లి గ్రోయిన్ పరిశీలించిన అధికారులు

- మంత్రి అమర్‌నాథ్ ఆదేశాలతో చర్యలు



గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

అనకాపల్లి రూరల్: మండలంలోని దిబ్బపాలెం సమీపంలో శారదానదిపై ఉన్న చెర్లోపల్లి గ్రోయిన్‌ను జల వనరుల శాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం పరిశీలించారు. దెబ్బతిన్న గ్రోయిన్‌ను విశాఖపట్నం జల వనరుల శాఖ ఎస్ఈ త్రినాథరావు, డీఈ శ్రీచరణ్‌లు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రోయిన్ ఆయకట్టు భూములకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నీటిని విడుదల చేయడానికి వీలుగా తక్షణ మరమ్మతుల కోసం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రోయిన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన అంచనా వ్యయానికి సంబంధించి నివేదికను తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారుల నివేదిక మేరకు నిధులను మంత్రి అమర్‌నాథ్ ఆదేశాలతో మండల పరిషత్ నిధుల నుంచి విడుదల చేస్తామని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. అనంతరం ఆ ప్రాంత రైతులతో అధికారులు చర్చించారు.